# కొమురయ్య కాశీత్ర

– కొలపల్లి ఈశ్వర్



అదొక చిన్న పెంకుటిల్లు.

ఉదయం ఎనిమిది గంటల వేళ...పాలమ్మాయి ఆ ఇంటి తలుపు తట్టి "తాతా! పాలు" అంటూ కేకేస్తే...లోపల నుంచి జవాబు రాలేదు.

రెండు మూడుసార్లు అలాగే పిలిచినా తలుపు తెరచుకొనకపోతే...అనుమానం వేసి కిటికీలోంచి లోపలికి తొంగి చూసిందామె.

లోపల మంచం మీద దుప్పటి కప్పుకొని పడుకుని ఉన్న కొమురయ్యలో చలనం లేదు. వెంటనే ఆ అమ్మాయి పక్కింటివాళ్లతో ఆ విషయం చెప్పింది. అందరూ క్షణాల్లో గుమిగూడారు. తలుపు తోసి లోనికి వెళ్ళి చూశారు. కొమురయ్య చనిపోయాడని అర్థమైంది. వెంటనే అందరి మొహాల్లోనూ విషాదం కమ్ముకుంది.

కొమురయ్య అక్కడ సంవత్సరం నుంచి అద్దెకుంటున్నాడు. చాలా మంచివాడిగా, మితభాషిగా గుర్తింపు పొందిన ఆ ముసలాయనకి ఎవరైనా ఉన్నారో లేదో ఎవరికీ తెలీదు. ఎక్కడో షాపుల్లో ఎకౌంట్లు రాసుకుని బతికేవాడు.

ఆ ఇంటి ఓనరు అక్కడికి చేరుకుని, వీధిలోని పెద్ద మనుషుల్ని పిలిపించి "ఏం చేద్దాం?" అని అడిగాడు.

"ఏముంది...పోలీసులకి తెలియ పర్చడమే..."అన్నారు వాళ్ళు.

పోలీసులొచ్చారు. కొమురయ్యా మంచం పక్కన ఒక పాత ట్రంకు పెట్టె వుంది. తాళం పగులగొట్టి ఆ ట్రంకు తెరిచారు. లోపల ఒక పాత డైరీ ఉంది. ఆ డైరీలో ఒక పేజీలో "నా కుమారుడు" అనే అక్షరాలు, దాని కింద ఒక చిరునామా రాసి ఉన్నాయి.

ఆ చిరునామాలోని వ్యక్తిని పిలిపించారు.

అరగంట తరువాత...

సుమారు నలభై ఏళ్ళ వయస్సున్న ఒక వ్యక్తి స్కూటర్‌పై తన భార్యా పిల్లల్ని తీసుకుని అక్కడికి చేరుకున్నాడు.

అతని మొహం గంభీరంగా ఉంది.

పోలీసులు కొన్ని వివరాలు సేకరించారు అతని నుంచి.

అతనొక గవర్నమెంటాఫీసులో యు.డి.సి. తల్లిదండ్రులు చాలా ఏళ్ళుగా అతనికి దూరంగా ఉంటున్నారు. తల్లి చనిపోయి మూడేళ్లయింది. ఆ తరువాత తండ్రి ఎటో వెళ్ళిపోయాడు.

ఇప్పుడు ఫోన్ చేసేదాకా...కొమురయ్య ఇక్కడ ఉంటున్నాడని అతనికి తెలియదు. అంతే!

ఇంకేముంది...కొంత కాలంగా నీరసంగా ఉంటున్నాడని అక్కడివాళ్ళు చెప్పారు. అయితే సహజ మరణమే అయి ఉంటుందనుకున్నారంతా. పైగా కొమురయ్యకు ఆస్తంటూ ఏమీ లేదు, ఆ ఒక్క ట్రంకు పెట్టె తప్ప!

"ఆ పెట్టెలో ఇంకా ఏమున్నాయి?" అడిగాడు కొమురయ్య కొడుకు చలపతి.

"ఒక సీలు చేసిన కవరు. కొన్ని బట్టలు."

ఆ కవరు మీద చలపతి అడ్రస్ రాసుంది.

చలపతి ఆ కవరు తెరిచి లోపల ఉన్న కాగితం బయటకు తీసి చదివాడు. అతని మొహం పాలిపోయింది అది చదవగానే. పక్కనున్న కానిస్టేబుల్ ఆ లెటర్ అందుకుని పైకి చదివాడు.

"ప్రియమైన కుమారునికి,

నేను నీకు చెప్పదగిన మాటలు ఏమీ లేవు. చివరి మాటగా ఒక తండ్రి తన కొడుకుతో ఈ మాట అన్నాడంటే...ఆ తండ్రిపై ఆ కొడుకు చూపించిన ప్రేమ ఏ పాటిదో ఎవరికైనా ఇట్టే అర్థమైపోతుందనుకుంటాను.

కన్న కొడుకుగా నా చితికి నిప్పంటించకపోతే నీకు మనశ్శాంతి ఉండదు కాబట్టి ఆ పని తప్పక చేస్తావని నాకు తెలుసు. అందుకు కృతజ్ఞతగా నేను నీకు ఒక విలువైన కానుకని ఇచ్చి వెళ్ళిపోతున్నాను. అది ఈ పెట్టెలోనే బట్టల అడుగున ఉంది. ఒక వేళ ఇప్పుడు నీ వద్ద ఉన్న సిరి సంపదలు, నీవాళ్ళనుకుంటున్న భార్యా పిల్లలు అందరూ నీ నుంచి దూరమైపోయినా ఏదో ఒక రోజు అది మాత్రం నీకు తప్పక పనికొస్తుంది.

ఇట్లు
నీ తండ్రి
కొమురయ్య

వెంటనే ఆ కానిస్టేబుల్‌తో పాటు అక్కడున్న వాళ్ళంతా తల తిప్పి ఆ పెట్ట వంక చూశారు ఆసక్తిగా.

చలపతి ఆ పెట్టెలోని పాత బట్టలని బయటకు తీసి...చివరగా ఒక వస్తువును బయటకు తీశాడు.

దాన్ని చూస్తూనే అందరూ ఆశ్చర్యంగా నోరు తెరిచారు.

అది కొమురయ్య రోజూ అన్నం పెట్టుకు తినే పాత జర్మన్ సిల్వర్ పళ్ళెం...

మరో మాటలో సత్తు గిన్నె... ❀

# పాఠకుల కోసం ప్రత్యేక శీర్షికలు

ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రికలో పాఠకులు పాల్గొనడానికి అవకాశం కల్పించే కొన్ని ప్రత్యేకమైన శీర్షికలను ప్రచురిస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

ఈ క్రింద పేర్కొన్న శీర్షికలలో దేనిని గురించైనా పాఠకులు తమ అనుభవాలను అరఠావు పేజీకి మించకుండా వ్రాసి పంపవచ్చును. మాకు అందిన రచనలలో ప్రచురణ యోగ్యంగా వున్నవాటిని స్వీకరించి, పంపినవారి ఫోటో చిరునామాలతో ప్రచురిస్తాము. ప్రచురించిన ప్రతి రచనకు పారితోషికం అందజేస్తాము.

## శీర్షికలు:

1. మరపురాని సంఘటన.
2. మోసపోయిన సందర్భం.
3. కథకాని కథ. (మీ అనుభవంలోని విచిత్రమైన వింత సంఘటన)
4. టెలివిజన్‌లో మీరు చూస్తున్న సీరియల్స్‌పై మీ అభిప్రాయాలు.
5. మీ ప్రాంతంలో ఏం జరుగుతోంది/జరగడంలేదు.
6. నేను చూసిన మొదటి సినిమా.
7. నాకు నచ్చిన ఉద్యోగం/వృత్తి/వ్యాపారం.
8. మా వారితో/ఆవిడతో తొలి పరిచయం.
9. మా ఇంట్లో "చిచ్చర పిడుగు" మీ ఇంట్లో పిల్లలతో జరిగిన మరువలేని అద్భుతమైన అనుభవం.

**మీ రచనలను - సంపాదకుడు, ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రిక, పోస్ట్ బ్యాగ్ నెం.399, మైలాపూర్, చెన్నయ్- 600 004. చిరునామాకు పంపగోరుతున్నాము.**

- సంపాదకుడు